సాక్షి మహబూబ్‌నగర్

గురువారం ၊ 12 ၊ జూన్ ၊ 2025

నేడు డీఈఓతో ఫోన్ ఇన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల కొరత, మూతపడిన పాఠశాలలను తెరిపించడం, విద్యార్థులను చేర్పించడం, పారిశుద్ధ్యం, ప్రైవేట్ పాఠశాలల్లో వసతులు, ఫీజులు, ఇతరత్రా సమస్యలపై సందేహాల నివృత్తి కోసం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్‌తో గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ ద్వారా డీఈఓతో నేరుగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

సమయం: మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్: 79950 87600

గరిష్టం/కనిష్టం
35.9 /22.4

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి.. ఔత్సాహికులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలశాఖ, మున్సిపల్, బీసీ, ఎస్సీ కార్పొరేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు భాగస్వామ్యంతో విరివిగా పరిశ్రమలు ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి.. నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గ్రీన్ ఇండస్ట్రీయల్ సెజ్, పోలేపల్లి సెజ్‌లో వీధిలైట్ల ఏర్పాటు, రోడ్డు మరమ్మతు పనులను జూలైలోగా పూర్తిచేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. అనంతరం టీ ప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి వాహనాల మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పి.ప్రతాప్, ఎల్‌డీఎం భాస్కర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ కె.నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ గణేశ్ ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో నేస్తం ఫిర్యాదు కార్యక్రమం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం నేస్తం ఫిర్యాదు పరిష్కార కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ ఆనంద్‌కట్టా, ఐఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేస్తం కార్యక్రమం ద్వారా ఉద్యోగులు వ్యక్తిగతంగా శాఖ అధికారులను కలిసి తమ సేవా సంబంధిత సమస్యలు, ఫిర్యాదులను నేరుగా తెలియజేసే అవకాశాన్ని పొందుతారని అధికారులు తెలిపారు. సమస్యను బట్టి వాటిని తక్షణం, వారం, 15 లేదా 30 రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. వేగవంతమైన సమస్యల పరిష్కారం, సానుకూలమైన పని వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు.

26న జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 26వ తేదీన జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ స్కూళ్లలో 4 తరగతిలో ప్రవేశాల కోసం జిల్లాస్థాయి ఎంపికలు జరగనున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లైయింగ్, 6X10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల రన్నింగ్ అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8–9 సంవత్సరాలు 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య జన్మించిన వారు ఎంపికలకు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు పాఠశాల, మున్సిపాలిటీ, ఎంఆర్‌ఓ జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రం, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 3వ తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, ప్రస్తుత స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. పైన పేర్కొన్న ధ్రువపత్రాల్లో ఏది లేకున్నా ఎంపికలకు అనుమతించమని తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికలు జూలైలో ఉంటాయని, మిగతా వివరాల కోసం 94406 56162 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.




పారదర్శకంగా టీజీపీఈసెట్

- పీయూలో ఆహ్లాదకరమైన వాతావరణం, వసతులు
- టీజీహెచ్‌ఈసీ చైర్మన్ బాలకిష్టారెడ్డి
- విద్యార్థులకు అందుబాటులోకి ఉపాధి ఆధారిత కోర్సులు

- వివరాలు 8లో..

● ఆటాపాటలకు బైబై

బడికి పోదాం.. చలో



జిల్లాలో నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేత
- సర్కారు బడుల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఇంటింటి ప్రచారం
- బడిబాట ద్వారా 3,360 మంది చేరిక
- జిల్లాలో 50 పాఠశాలల్లో ఏఐ తరగతుల బోధన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో ఆడిపాడిన పిల్లలు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. నెలన్నర రోజులుగా మూతబడిన పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు సర్కారు బడుల్లో అడ్మిషన్లు భర్తీ చేసేందుకు పది రోజులుగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 3,360 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. కాగా.. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాం పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. తరగతి గదులను శుభ్రం చేసి.. పాఠశాల అందంగా అలకరించాలని, అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు గతంలో పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలు, మార్కులతో బ్యానర్‌లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 820 పాఠశాలలు ఉండగా.. అందులో 50 జీరో–టచ్ ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కూడా అడ్మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

■ ఇప్పటి వరకు పార్ట్–1 పాఠ్య పుస్తకాలు 4,39,060 రావాల్సి ఉండగా 4,30,260 ప్రభుత్వం పంపిణీ చేసింది. ఎన్విరార్‌మెంటల్ సైన్స్‌కు సంబంధించి 2 టైటిల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. హైస్కూల్ విద్యార్థులకు సంబంధించి నోటు పుస్తకాలు 1.40 లక్షలు రావాల్సి ఉండగా 1.10 లక్షలను ఆయా పాఠశాలలకు అందజేశారు. 66 వేల యూనిఫాంలు కుట్టేందుకు మహిళా సంఘాలకు అప్పజెప్పగా.. కుట్టే ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది.

పండగ వాతావరణంలో బడులు ప్రారంభం

'నేడు పండగలా పాఠశాలలను ప్రారంభించాలి. బడులకు తోరణాలు, పూలతో అలకరించి విద్యార్థులకు స్వాగతం పలకాలి.' అని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. ప్రారంభం రోజు నుంచే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, మంచి విద్యను అందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.

ఏఐ బోధనతో అడ్మిషన్లు పెరిగే అవకాశం

ప్రైవేటు పాఠశాలల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ **ఇంటలిజెన్స్**) తరగతులు బోధిస్తామని **ప్రచారం** చేస్తున్న క్రమంలో.. వాటికి **పోటీగా ప్రభుత్వ** పాఠశాలల్లో సైతం విద్యా**ర్థుల సంఖ్య** పెంచేందుకు ఈ ఏడాది ఏఐ **తరగతులను** నిర్వహిస్తున్నారు. చదువులో **వెనుకబడి ఉన్న** విద్యార్థుల మేధాశక్తి పరిశీ**లించేందుకు** ఏఐ సహకారంతో పలు సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం గతేడాది 30 పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 50 పాఠశాలల్లో ఏఐ తరగతులను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు అన్ని బడుల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను బోధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



మొదటి రోజు పండగలా ఉండేది..



నేను మలక్‌పేట నెహ్రూ మెమోరియల్ గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకున్నాను. కాలనీలో స్కూల్స్‌లో ఉండడం వల్ల పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది కాదు. సెలవుల తర్వాత మొదటి రోజు పాఠశాలకు వెళ్లాలి అంటే ఒక పండగా ఫీల్ అయ్యేవాళ్లం. బడి ప్రారంభం రోజు కొత్త టీచర్ ఎవరు వస్తారని ఆలోచించేవాళ్లం. పుస్తకాలు, నోటు బుక్కులు కొనుక్కోవడం ఉత్సాహంగా ఉండేది.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ

చాలా సంతోషంగా వెళ్లే వాళ్లం



ఎండకాలం సెలవులు ముగిసిన తర్వాత తొలిరోజు సంతోషంగా స్కూల్‌కు వెళ్లేవాళ్లం. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని గుండుగుండ్లపాలెం మా సొంతూరు. మా ఊరి నుంచి పాలకవీడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నా. మా ఊరి నుంచి స్కూల్‌కు మూడు కిలోమీటర్ల దూరం ఉండేది. ప్రతిరోజూ స్నేహితులతో కలిసి నడిచి వెళ్లే వాళ్లం. ఆ రోజులు గుర్తు చేసుకుంటే చాలా ఆనందం అనిపిస్తుంది. స్కూల్ నాటి జ్ఞాపకాలు జీవితంలో మరిచిపోలేని తీపి గుర్తులు.

– వెంకట్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ

జిల్లాకే 'ఆదర్శం' వెన్నాచేడ్ స్కూల్

- ప్రతి ఏటా వందశాతం ఉత్తీర్ణత



గండేడ్: పేరులోనే కాదు ఫలితాల్లో కూడా ఆదర్శంగా నిలుస్తోంది జిల్లాలో ఏకైక ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్). మారుమూల గ్రామంలో ఉన్నప్పటికీ ఈ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో ఉన్న ఈ పాఠశాలను 2013లో అప్పటి హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. మోడల్ మంజూరైనప్పటికీ ప్రభుత్వ భూమి లేకపోవడంతో వెన్నాచేడ్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ద్వారా వచ్చిన డబ్బు, గ్రామస్తుల సహకారంతో ఐదు ఎకరాల భూమిని సమకూర్చి.. పక్కా భవన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన సాగుతోంది. 2016లో పదో తరగతి మొదటి బ్యాచ్ పదో తరగతి పరీక్షలు రాశారు. 64 మంది పరీక్ష రాయగా.. వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 2017లో 93 శాతం 2019లో 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. మిగతా అన్ని విద్యా సంవత్సరాల్లో 2025 వరకు వందశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ ఏడాది 91 మంది పదోతరగతి పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్‌లోనూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 483 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంటర్‌లో 110 మంది ఉన్నారు.

కార్పొరేట్ తరహా వసతులు

మోడల్ స్కూల్‌లో అన్ని వసతులు కార్పొరేట్ తరహాలో ఉన్నాయి. పెద్దపెద్ద తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన క్రీడా ప్రాంగణం, మీటింగ్ హాల్స్‌తో పాటు ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వందమంది బాలికలకు సరిపోయే హాస్టల్ వసతితో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు.

■ వెన్నాచేడ్ గ్రామానికి మెయిన్‌రోడ్డుకు పాఠశాల 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. పాఠశాలకు వెళ్లాలంటే కాలినడక తప్పదు. అయినా తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలోనే చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయ బృందం ఉండడంతో ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి చక్కగా చదువుకొనేలా ప్రోత్సహిస్తున్నారు. వెంకట్‌రెడ్డిపల్లి, మంగంపేట్, మహబూబ్‌నగర్, మహమ్మదాబాద్, కొండారెడ్డిపల్లి, పగిడ్యాల్, జూలపల్లి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వస్తున్నారు. ఎంట్రన్స్‌లో మెరిట్ ప్రకారం ఇక్కడ అడ్మిషన్లు ఇస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం..



విద్యార్థుల భవితే మా బాధ్యత. అనుభవమున్న ఉపాధ్యాయుల సహాయంతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. పాఠశాలలో అన్ని రకాలు ల్యాబ్‌లు ఉన్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేలా బోధన ఉంటుంది. ప్రతి సంవత్సరం వందశాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విశాలమైన క్రీడా ప్రాంగణం ఉండడంతో క్రీడల్లో సైతం ప్రోత్సహిస్తున్నాం.

– రహీస్ ఫాతిమా, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, వెన్నాచేడ్

పబ్లిక్ స్కూల్‌గా బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్

- శతాబ్ది ఉత్సవాల వేళ అరుదైన గౌరవం
- పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్, డీఈఓ
- నేడు పాఠశాలలో కేక్‌కటింగ్, మొక్కలు నాటే కార్యక్రమం



జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతుంది. 1925లో ప్రారంభమైన పాఠశాల బుధవారం నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంది. ఈ తరుణంలో పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న పబ్లిక్ స్కూల్‌కు ఎంపికైంది. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

■ 1925–26 విద్యాసంవత్సరంలో రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ధర్మశాల వద్ద ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై.. కొద్దిరోజులకే తెలుగు మీడియం ప్రారంభించారు. 1949–50లో మాధ్యమిక పాఠశాలగా మారుస్తూ సిగ్నల్‌గడ్డకు తరలించారు. 1956–57లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసి 2009లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. వందేళ్లుగా విద్యనందిస్తూ ఎంతో మంది విద్యావేత్తలను తీర్చిదిద్దింది.

■ ఈ ఏడాది ప్రారంభమవుతున్న పబ్లిక్ స్కూళ్లలో బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ఒకటి. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రీప్రైమరీ నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో బోధన ప్రారంభం కానుంది. విద్యార్థులు ఇక్కడే ఉండేందుకు వసతులు కల్పించనున్నారు. సమీపంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను విలీనం చేయనున్నారు. ఇందులో కొనసాగుతున్న ఉర్దూ, తెలుగు మీడియం బోధనను వేరే పాఠశాలకు తరలించనున్నారు.



హైస్కూల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ

■ బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈఓ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలను తెలుసుకున్నారు. పబ్లిక్ స్కూల్ నిర్వహణకు రూట్‌మ్యాప్ రూపొందించాలని ఆదేశించారు.

■ హైస్కూల్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు జరిపేందుకు పూర్వవిద్యార్థుల సంఘం కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. వంద మొక్కలు నాటడంతోపాటు కేక్‌కట్ చేసి సంబరాలు జరపనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరుకానున్నారు.

ఏడాదంతా సంబరాలు

బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది పొడవునా సంబరాలు చేసుకోబోతున్నాం. పూర్వ విద్యార్థుల సహకారంతో సంబరాలను ఘనంగా జరిపేందుకు ప్రయత్నిస్తున్నాం.

– చంద్రకళ, హెచ్‌ఎం, బాదేపల్లి జెడ్పీ హైస్కూల్

వంద మొక్కలు నాటుతాం

బాదేపల్లి బాలుర జెడ్పీహైస్కూల్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పాఠశాల పునఃప్రారంభం రోజున కేక్‌కటింగ్, వంద మొక్కలు నాటుతున్నాం. పూర్వవిద్యార్థుల అధికసంఖ్యలో హాజరుకావాలి.

– రవిశంకర్, పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు

పాఠశాలకు అరుదైన గౌరవం

శతాబ్ది సంబరాల వేళ జెడ్పీహైస్కూల్ పబ్లిక్‌స్కూల్‌గా మారడం అరుదైన గౌరవం దక్కింది. చిన్నపాటి యూనివర్సిటీలా హైస్కూల్ మారబోతుంది. పబ్లిక్‌స్కూల్ మంజూరులో ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది.

– మంజులాదేవి, ఎంఈఓ, జడ్చర్ల

14న జాతీయ లోక్ అదాలత్

- జిల్లాలో 8 బెంచీలు ఏర్పాటు
- ఇప్పటికే 3వేల కేసుల్లో కక్షిదారులకు నోటీసులు జారీ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ అధిక సంఖ్యలో పెండింగ్ కేసులు రాజీ అయ్యే విధంగా ప్రతి ఒక్క విభాగం బాధ్యత తీసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లా కోర్టులో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో 17,431 కేసులు రాజీ చేశామని, ఈనెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్ అంతా కంటే ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీస్‌శాఖ, బ్యాంకు నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్స్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులు కోర్టుకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఇప్పటికే చెక్ బౌన్స్‌పై వారం రోజుల పాటు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించి కేసులు రాజీ చేయనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించి.. రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న ప్రతి కేసులో కక్షిదారులు హాజరుకావాలని సూచించారు. 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో భాగంగా మహబూబ్‌నగర్ కోర్టులో ఆరు బెంచీలు, జడ్చర్లలో రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే 3,010 కేసులలో ఉన్న కక్షిదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసిన సందర్భంలో కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కోర్టుకు చెల్లించిన ఫీజు సైతం తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ రూరల్: వృద్ధులు, దివ్యాంగుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వృద్ధులు, దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 మంది దివ్యాంగులు పలు సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలని, పింఛన్లు మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో దివ్యాంగులు చిరువ్యాపారం చేసుకోవడానికి స్థలం లేదా షాపులు కేటాయించాలని సమస్యలపై దివ్యాంగులు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జరీనాబేగం, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కోటేశ్వర్‌రెడ్డి, అంజయ్య ఆచారి పాల్గొన్నారు.



ప్రజావాణిలో దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

పశుసంవర్ధక శాఖ మంత్రిగా వాకిటి

- పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖలు కూడా..
- మక్తల్‌కు మూడుసార్లు దక్కిన అమాత్యగిరి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రెండో దఫా చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి పాలమూరులోని మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన ఈ నెల 8న మరో ఇద్దరు మంత్రులతో కలిసి రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అయితే రెండు రోజులుగా ఆయనకు ఏ శాఖలు కేటాయిస్తారనే అంశంపై ఉమ్మడి జిల్లాలో నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. బుధవారం రాత్రి శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగా.. వాకిటి శ్రీహరికి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖలు దక్కాయి. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మక్తల్ నుంచి మూడో వ్యక్తి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం కాసు బ్రహ్మనందరెడ్డి హయాంలో తొలిసారిగా నారాయణపేటకు చెందిన రాంచందర్ కల్యాణి మార్కెటింగ్‌శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో టీడీపీ నుంచి మక్తల్ ఎమ్మెల్యేగా ఎల్లారెడ్డి గెలుపొందగా.. ఆయనకు 1997లో మార్కెటింగ్ శాఖ మంత్రి పదవి దక్కింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మూడో పర్యాయం 2023లో జరిగిన ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి ఈ నెల 8న మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ లెక్కన మక్తల్ నుంచి ముగ్గురికి మంత్రి పదవులు దక్కినట్లయింది.

గుడిబండ.. శోకసంద్రం

- రంగారెడ్డి జిల్లా యాచారం మండలం సాగర్ రోడ్డుపై ఘోర ప్రమాదం
- కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ముగ్గురు యువకుల మృతి... మరో నలుగురికి తీవ్ర గాయాలు



- వివరాలు 8లో..

క్లుప్తంగా

రోటవేటర్ కింద పడి విద్యార్థి మృతి

కోడేరు: రోటవేటర్ కింద పడి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం జనుంపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్సై గోకారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి నాగేంద్రం ఉదయం తన కుమారుడు సాయికుమార్(13)ను పొలం వద్దకు తీసుకెళ్లాడు. డ్రైవర్ సత్యనారాయణ నాగేంద్రం పొలంలో రోటవేటర్‌తో దుక్కి దున్నుతుండగా వెనకాల ఉన్న సాయికుమార్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి మృతిచెందాడు. నాగేంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్: పరిశ్రమలో పైకప్పు షీట్‌వేస్తూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడిపోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని గుండ్లపొట్లపల్లిలో చోటుచేసుకున్నది. రాజాపూర్ ఎస్సై శివానందంగౌడ్ కథనం ప్రకారం.. గుండ్లపొట్లపల్లి శివారులో బిస్‌క్రాజీకవలేవ్య పరిశ్రమలో మంగళవారం సాయంత్రం పాతసీట్స్ తొలగించి కొత్తసీట్స్ వేసి వెల్డింగ్ చేస్తుండగా.. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్‌హమీద్ ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. వెంటనే అక్కడే ఉన్న అతని తమ్ముడు చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి అబ్దుల్‌సలీం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లితో గొడవ పడి యువతి..

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని షాబాద్ గ్రామానికి చెందిన మహేశ్వరి(25)కి గతంలో వివాహం కాగా, భర్తతో విడాకులు తీసుకొని కొంత కాలంగా తల్లి పద్మమ్మతో కలిసి గ్రామంలో ఉంటోంది. ఈ క్రమంలో హైదరాబాద్ వెళ్లి పోటీ పరీక్షలకు చదువుకోవడం కోసం తనకు రూ.1లక్ష కావాలని ఈ నెల 2న తల్లిని కోరింది. ఆమె రెండు రోజుల్లో సమకూరుస్తానని చెప్పడంతో గొడవపడి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి ఆమెను తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం


పోలీసుల అదుపులో వృద్ధుడు తిరుపతయ్య

పాన్‌గల్: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించిన సంఘటన బుధవారం మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం గ్రామంలో కోళ్ల షెడ్డు నిర్మాణం పనులు చేసేందుకు వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టకు చెందిన తిరుపతయ్య(65) కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం షెడ్డు సమీపంలో ఓ ఇంటి ముందు ఊయల ఊగుతున్న బాలిక(6)ను మద్యం మత్తులో చేతిపట్టుకొని షెడ్డు లోపలికి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించగా బాలిక గట్టిగా అరుస్తూ కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని వృద్ధుడికి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు 100 సమాచారం ఇవ్వడంతో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడాది తర్వాత దొరికిన బాలుడు



మిడ్జిల్: మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఎండీ సలీమా, జహంగీర్ దంపతుల పెద్ద కుమారుడు ఎండీ సమీర్ (15) గతేడాది 15 ఏప్రిల్ 2024న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అదే రోజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అదే రోజు బాలుని వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేశారు. కొన్ని రోజుల క్రితం ఆ యాప్ ద్వారా బాలుడు బెంగూళూర్‌లోని ఒక హాస్టల్‌లో ఉన్నాడని సమాచారం రావడంతో, ఆ బాలుని బెంగూళూర్ నుంచి తీసుకొచ్చి బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. సంవత్సరం తర్వాత కుమారుడు ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా టీజీపీఈసెట్



మాట్లాడుతున్న టీజీహెచ్‌ఈసీ చైర్మన్ బాలకిష్టారెడ్డి

టీజీహెచ్‌ఈసీ చైర్మన్ బాలకిష్టారెడ్డి

- పీయూలో 170ఎకరాల్లో ఆహ్లాదరకమైన వాతావరణం, వసతులు
- అందుకే టీజీపీఈసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాం
- విద్యార్థులకు అందుబాటులోకి ఉపాధి ఆధారిత కోర్సులు
- ఉత్సాహంగా ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నిర్వహిస్తున్న టీజీపీఈసెట్–2025ను పారదర్శకంగా నిర్వహిస్తామని టీజీహెచ్‌ఈసీ (తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్) చైర్మన్ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలోని సింథటిక్ ట్రాక్ గ్రౌండ్స్‌లో సెట్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఈవెంట్స్‌నుఆయన గన్‌పేల్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఎప్పుడూ పీయూకు రాలేదుని, ఇప్పుడు రావడం చాలా గొప్పగా భావిస్తున్నాని, పచ్చని చెట్లమధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో యూనివర్సిటీ ఉండడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పీయూలో అందుబాటులో ఉన్న సింథటిక్ ట్రాక్, గ్రౌండ్స్ ఇతర సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని సెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. తాను పాలమూరుకు చెందిన వ్యక్తిని అయినప్పటికీ జిల్లాల మధ్య తారతమ్యాన్ని చూడనని పేర్కొన్నారు ఉన్నత విద్యామండలి అంటేనే అఫర్డబిలిటీ, యాక్సబిలిటీ, క్వాలిటీ అని, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో కూడా మంచి నాణ్యతా ప్రమాణాలను తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. దేశానికి నిజమైన ఆస్తి యువతనేనని.. నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించిన వెంటనే ఉద్యోగ అవకాశాలు పొందేవిధంగా కోర్సుల్లో మార్పులు తీసుకొస్తున్నామని, సిలబస్‌లో కూడా మార్పులు ఉంటాయని పేర్కొన్నారు.

ఈవెంట్‌కు 517మంది హాజరు

పీయూలో సెట్ అభ్యర్థులు ఈవెంట్స్‌ను కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి, పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, సెట్ కన్వీనర్ దిలీప్ ఉదయం 7:30గంటలకు సింథటిక్ ట్రాక్‌లో 100 మీటర్ల పరుగు పందేన్ని గన్‌ఫైర్ చేసి ప్రారంభించారు. అనంతరం ఇండోర్ స్టేడియం పక్కన ఏర్పాటు చేసిన రెండు క్రికెట్ నెట్‌లను ప్రారంభించగా.. వీసీ బౌలింగ్ చేస్తే కౌన్సిల్ చైర్మన్ బ్యాటింగ్‌తో అలరించారు. వీటితోపాటు పీజీ కళాశాల పక్కనున్న గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పలు కోట్‌లను పరిశీలించారు. మొదటిరోజు ఈవెంట్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 732మంది మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 517మంది పాల్గొనగా.. 215మంది గైర్హాజరైనట్లు సెట్ కన్వీనర్ దిలీప్ పేర్కొన్నారు. అభ్యర్థులు రన్నింగ్ షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ అనతతరం 11 క్రీడాంశాల్లో పాల్గొన్నారు.

సెట్ ను సమర్థవంతంగా నిర్వహిస్తాం

పాలమూరు యూనివర్సిటీ చరిత్రలో ఒక రాష్ట్రస్థాయి సెట్ నిర్వహణకు మొట్టమొదటిసారి అవకాశం ఇవ్వడం చాలా గొప్ప విషయమని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సెట్ నిర్వహణ బాధ్యతలను తమపై నమ్మకం ఉంచి అప్పగించినందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పాలమూరుపై మంచి అభిమానం ఉన్న ఆయన పీయూలో జరిగే సెట్ ఈవెంట్స్‌కు హాజరు కావడం గొప్ప విషయమన్నారు. ఈవెంట్స్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. గతంలో పనిచేసిన వీసీలు వసతుల కల్పనకు కృషిచేశారని, సింథటిక్ ట్రాక్, గ్రౌండ్ నిర్మించడంతో విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సెట్ కన్వీనర్ దిలీప్‌కుమార్, పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, మాజీ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్, భూమయ్య, అర్జున్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పీయూలో నెట్ క్రికెట్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి


వాలీబాల్ ఆడుతున్న అభ్యర్థులు

కాళేశ్వరం కమిషన్ విచారణ త్వరగా పూర్తి చేయాలి

- మంత్రులు సమష్టిగా పనిచేసి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


శతాబ్ది ఉత్సవాల సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర మంత్రులు సమష్టిగా పనిచేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడకపోతే పథకాలు పెట్టినా ప్రయోజనం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరు మీద తప్పుల మీద తప్పులు చేసిందని ఆరోపించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీళ్ల రావడం లేదన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టు భవితవ్యాన్ని తేల్చాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ.10 వేల కోట్లు విద్యుత్ చార్జీలకు, మరో రూ.10 వేల కోట్లు అప్పులకు చెల్లించే పరిస్థితుల నుంచి బయటపడాలన్నారు. ఎక్కువ ఊహించుకొని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.ఉద్యోగ క్యాలెండర్ మాదిరి ప్రాజెక్టుల పూర్తికి క్యాలెండర్ విడుదల చేయాలని అన్నారు. వందేళ్ల పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపడం సరికాదన్నారు. సంబాల కేశవరావును చంపిన తర్వాత దేశంలోని కోట్లాది మంది ప్రజలు కేంద్ర ప్రభుత్వ చర్యను వ్యతిరేకించారన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ప్రభుత్వాలు పని చేయడం సరికాదన్నారు.

మార్క్సిజం, లెనినిజం ద్వారానే పేదల బతుకుల్లో వెలుగులు..

భరత గడ్డ విముక్తి పోరులో భారత కమ్యూనిస్టు పార్టీ నడిపిన వీరోచిత కమ్యూనిస్టు ఉద్యమం చరిత్రాత్మకమని, కమ్యూనిజాన్ని అంతం చేయాలనుకుంటే కాలి బూడిదైపోతారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా వందలాది మంది ప్రజలు, కార్మికులు, సీపీఐ శ్రేణులతో అల్మాస్ ఫంక్షన్ హాలు వరకు ఎర్ర జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అల్మాస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన శతాబ్దిఉత్సవాల సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీలో తుదిశ్వాస వరకు సొంత ఆస్తులు పంచుతూ జైలు నిర్బంధాలను, అక్రమ కేసులను లెక్కచేయకుండా ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని నైజం కమ్యూనిస్టులేదే అన్నారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని 2026 డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఆనంద్, పరమేశ్‌గౌడ్, ఉసేనయ్య, నరేందర్‌రెడ్డి, సురేశ్, రాము పాల్గొన్నారు.

గుడిబండ.. శోకసంద్రం

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ వద్ద రోడ్డు ప్రమాదం

- గ్రామానికి చెందిన ముగ్గురి దుర్మరణం.. మరో నలుగురికి గాయాలు
- బర్త్ డే వేడుకలు ముగించుకొని వస్తుండగా ప్రమాదం


విషాదంలో బంధువులు


వాస పవన్‌కుమార్ (ఫైల్)


వాస రాఘవేంద్ర (ఫైల్)


వాస సాయితేజ (ఫైల్)

అడ్డాకుల: బర్త్ డే సెలబ్రేషన్స్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం మండలంలోని గుడిబండలో మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. మృతులు, క్షతగాత్రులందరూ ఒకే సామాజికవర్గానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు కావడంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వాస శివకుమార్ అలియాస్ కుమార్ హైదరాబాద్‌లో ప్రైవేట్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అతడి బర్త్ డే ఉండటంతో అతనికి వరుసకు సోదరులయ్యే వాస పవన్‌కుమార్(25), వాస సాయితేజ (22), వాస రాఘవేంద్ర (23)తో పాటు సొంత తమ్ముడు సాయికుమార్, మూసాపేటకు చెందిన సందీప్, హైదరాబాద్‌కు చెందిన శివకుమార్‌గౌడ్ కలిసి ఉదయం కారులో హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వద్ద ఉన్న వైజాగ్‌కాలనీకి వెళ్లారు. వేడుకలు జరుపుకొని అర్ధరాత్రి తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేటు బస్సు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో వాస పవన్ కుమార్, వాస సాయితేజ, వాస రాఘవేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా.. కుమార్, అతడి తమ్ముడు సాయికుమార్, సందీప్, శివకుమార్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఒక్కగానొక్క కుమారుడు..

వాస బుర్రన్న, పద్మ దంపతులకు కుమారుడు వాస పవన్‌కుమార్, కుమార్తె ఉండగా. కుమార్తె వివాహం జరిగింది. పవర్‌కు భార్య వరలక్ష్మి, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. మధుమేహ వ్యాధి తీవ్రమై బుర్రన్నకు ఇటీవల కాలు తొలగించారు. పవన్ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ భవన నిర్మాణాల వద్ద మిల్లర్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ పోషణ కాలు లేని తండ్రికి భారం కానుంది. పవన్ భార్య వరలక్ష్మి ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి.

కారు డ్రైవింగ్‌కు వెళ్లి..

వాస బాలస్వామి, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. చిన్న కుమారుడు వాస సాయితేజ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. సోదరుడు రవితేజ బెంగళూర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. సాయితేజకు ఇంకా పెళ్లి కాలేదు. చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆదుకుంటాడనుకుంటే..

వాస లక్ష్మయ్య, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. పెద్ద కుమారుడు వాస రాఘవేంద్ర ప్రైవేట్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తారు. హైదరాబాద్‌లో ఉంటున్న రాఘవేంద్రకు ఇంకా పెళ్లి కాలేదు.

ఘటనపై ఎమ్మెల్యే ఆరా..

దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు తగిన సాయం అందించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యాబోధనపై నిరంతర శోధన చేయాలి



టీజీహెచ్‌ఈసీ చైర్మన్ బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్

- హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాబోధనపై నిరంతరం పరిశోధనలు చేయాలని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో మారిన నూతన విద్యావిధానం రీసెర్చ్ మెథడ్స్‌పై విద్యాకళాశాల అధ్యాపకులు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆవిష్కరణలతో విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధించేందుకు అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించడంతో ఆలోచనా ధోరణి మారుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసేందుకు అధ్యాపకులు పాటుపాలని, బోధనలో సమర్థవంతమైన నైతిక విద్యను అందిచేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. పీయూ వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పరిశోధన కార్యక్రమాలతో విద్యాప్రమాణాలను గణనీయంగా పెంచుతుందని, వర్క్‌షాప్‌ల నిర్వహణతో అధ్యాపకులు, గణాంకసాధనాలు, డాటా విశ్లేషణ, విద్యారచణ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెరుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఆంజనేయులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

- సెప్టెంబర్ 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహణ
- బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రవికుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లాకు మరోసారి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కేటాయించినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ బుధవారం తెలిపారు. గతేడాది ఆగస్టులో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–19 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 7వతేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో అండర్–13 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిరకాల వసతులు కల్పిస్తామన్నారు. జిల్లాకు రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ టోర్నీ కేటాయించినందుకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- రక్షణ శాఖ సహాయ మంత్రికి ఎంపీ డీకే అరుణ వినతి

పాలమూరు: ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా నారాయణపేటలోని సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియపై చర్చించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత వల్ల సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయిన విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైనంత త్వరగా సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


వినతి పత్రం ఇస్తున్న ఎంపీ డీకే అరుణ

కల్యాణం కమనీయం..


అలంకరణలో స్వామి దంపతులు


అమ్మవారి తాళిబొట్టును చూపుతున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమిరోజు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. పవిత్ర కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఊరేగించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం పెట్టి తరలివచ్చిన ఆశేషభక్తులు తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారికి మంగళసూత్రధారణ చేశారు. కల్యాణం అనంతరం ఉత్సవవిగ్రహాలను పల్లకీలో గర్భగుడికి తీసుకెళ్లి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు అర్చకులు పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం


పరిశ్రమ నుంచి బయటకు వస్తున్న దట్టమైన పొగలు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్ సమీపంలో బుధవారం ఓ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చెట్టు కర్రలతో కాగితం అట్టలు తయారయ్యే డెక్కన్ గోల్డ్ ఇండస్ట్రీలో యంత్రాలలో సాంకేతిక సమస్యలు ఏర్పడి షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. ఒక్కసారిగా దట్టమైన పొగలు కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే పరిశ్రమలో ముడిసరుకు అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి హాని జరుగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ విషయమై పరిశ్రమ నిర్వాహకులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి

అమరచింత: ప్రమావశాత్తు వ్యవసాయ బావిలో జారిపడి పట్టణానికి చెందిన బిందే కురుమన్న(45) మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కురుమన్న జములమ్మ ఆలయం సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. బావిలో నీటిని తీసుకోచ్చేందుకు వెళ్లి కాలుజారి బావిలో పడి మృతిచెందాడు. పొలానికి వెళ్లిన కురుమన్న ఇంటికి రాకపోవడంతో పొలం, బావివద్ద గాలించగా.. బావిలో మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



టీజీఏఎన్‌బీ-‘మా’ సహకారంతో ‘ఆపరేషన్ సంకల్ప్’

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో ‘ఆపరేషన్ సంకల్ప్’ అధికారికంగా ప్రారంభించారు. ఇది తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, సివిల్ ఫోర్స్ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన వినూత్న కార్యక్రమమని టీజీఏఎన్‌బీ తెలిపింది. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మాదాల రవి, టీజీఏఎన్‌బీ ఎస్పీ పి.సీతారామ, డిపార్ట్‌మెంట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ డైరెక్టర్ శైలజ తదితరులు హాజరయ్యారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే తమ లక్ష్యం దిశగా ఇది ఒక శక్తివంతమైన అడుగు అని వారు పేర్కొన్నారు.

25న పోలవరంపై ప్రధాని ‘ప్రగతి’ సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ నెల 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణతోపాటు సంబంధిత రాష్ట్రాలకు తాజాగా కేంద్రం సమాచారాన్ని అందించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఏపీ సర్కారుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం మేరకు నీళ్లను నిల్వ చేస్తే తమ రాష్ట్రాల్లో ఏర్పడనున్న ముంపు సమస్యను పరిష్కరించాలని, భూసేకరణతో పాటు పరిహారం చెల్లించాలని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని తెలంగాణతో సహా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో ప్రధాని మోదీ గత నెల 28న ఈ ప్రాజెక్టుపై ప్రగతి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అప్పట్లో వాయిదా పడింది. తాజాగా ఈ నెల 25న నిర్వహించనున్నట్టు కేంద్రం తెలిపింది.

పాతికేళ్లకు వృద్ధ భారతం!

▶ మొదటి పేజీ తరువాయి

రెట్టింపునకు మించి 34.7 కోట్లకు (జనాభాలో 20.8 శాతం) చేరుకుంటుందని అంచనా. ఇది దేశ ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటికే దేశంలో ఆర్థిక అభద్రత, కుటుంబపరమైన సహాయ సహకార వ్యవస్థ క్షీణత, వైద్య, ఆరోగ్య సేవల విషయంలో అసమానతల పెరుగుదల లాంటి తదితర కారణాల వల్ల వృద్ధుల సంఖ్య పెరుగుదల అనేది ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక అంశాలను ప్రభావితం చేస్తుండటం చర్చనీయాంశంగా ఉంది. భారత్ క్రమంగా వృద్ధ సమాజంగా మారనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది ఒక సంక్షోభంగా పరిణమించవచ్చుననే హెచ్చరికలు కూడా ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ‘ఇండియాస్ ఏజింగ్ సొసైటీ: ద ల్యాండ్ స్కేప్ టుడే’- గివ్ గ్రాంట్స్ ఇండియా’ నివేదిక’లో ఇందుకు సంబంధించిన అనేక అంశాలు వెల్లడయ్యాయి. ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 (యూఎన్ఎఫ్‌పీఏ ఇండియా, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సంయుక్త పరిశీలన), కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ పరిశోధనల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

29 శాతం మందికే పెన్షన్


పెన్షన్ అందని వృద్ధుల బతుకు భారంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలోని వృద్ధులలో 29% మందికే పెన్షన్ (వివిధ రూపాల్లో) లభిస్తోంది. దాదాపు 40% మంది వృద్ధులు అత్యల్ప ఆదాయ వర్గ కుటుంబాలకు చెందినవారు. వారి జీవితం.. భద్రమైన ఆదాయం, కుటుంబ మద్దతు తగ్గిపోతున్న ఈ కాలంలో మరింత కష్టతరంగా మారుతోంది. వృద్ధులపై జరిగే దౌర్జన్యాలలో 71% కేసులు మహిళలకు సంబంధించి ఉంటున్నాయి. దేశంలోని సగానికి పైగా వృద్ధులు మొబైల్ ఫోన్లు లేదా ఇంటర్నెట్ ఉపయోగించలేరు. ఇది వారిని సమాజం నుంచి పూర్తిగా వేరుచేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కు పైగా మాత్రమే వృద్ధుల వసతి గృహాలున్నాయి.

దెబ్బతీస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు...

ప్రస్తుతం వృద్ధులలో..50% మందికి అధిక రక్తపోటు, 43% మందికి మధుమేహం (డయాబెటిస్) 33% మందికి అస్తమా వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరమయ్యే పరిస్థితులు. కానీ దేశవ్యాప్తంగా తక్కువ సంఖ్యలో మాత్రమే గెరియాట్రిక్ వైద్య నిపుణులున్నారు. పౌర ఆరోగ్య బీమా పథకం ద్వారా 25% వృద్ధులకు మాత్రమే బీమా లభిస్తోంది.

వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు

అటల్ వయో అభ్యుదయ యోజన, జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, రాష్ట్రీయ వయోశ్రీ పథకం. అయితే వీటిపై ప్రజల్లో అవగాహన లోపం, ఇవి సరిగా అమలు కాకపోవడం, గ్రామీణ ప్రాంతాలకు చేరిక తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి.



ఏం చేయాలి?

పెన్షన్ వ్యవస్థను విస్తరించాలి. అసంఘటిత రంగం వృద్ధులకు కూడా చేరుకునేలా చూడాలి. అత్యాధునిక వృద్ధుల నివాస గృహాలు స్థాపించాలి. సహాయ జీవన, ఆరోగ్య ఆధారిత సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జీరో టాలరెన్స్ పథకం – వృద్ధులపై దౌర్జన్యాలపై కఠినచర్యలు. డిజిటల్ సహిత వృద్ధులు – డిజిటల్ సాంకేతికతపై శిక్షణ. వృద్ధ మహిళల ప్రత్యేక పథకాల కు, ఆర్థిక స్వయం సాధన, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి.

తొలగించిన కులాలపై ముగిసిన విచారణ

- ప్రభుత్వానికి త్వరలో బీసీ కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ జాబితా నుంచి గతంలో తొలగించిన కులాల చేర్పునకు సంబంధించి బీసీ కమిషన్ బహిరంగ విచారణ బుధవారంతో ముగిసింది. మూడురోజుల పాటు జరిగిన ఈ విచారణలో మొత్తం 133 గ్రూపులతో కమిషన్ మాట్లాడింది. బుధవారం జరిగిన విచారణలో 64 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, రంగు బాలలక్ష్మి, ఇతర అధికారులు ఈ విచారణలో వచ్చిన వినతులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ రాష్ట్ర బీసీ కుల జాబితానుంచి 26 కులాలు తొలగించారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని కులాలు కావడం, తెలంగాణలో ఆయా కులాలు స్థానికంగా లేకపోవడంతో అప్పట్లో వాటిని తొలగించారు. అయితే ఈ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని కమిషన్‌కు వినతులు రావడంతో ఈ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ త్వరలో ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

కూకట్‌పల్లిలో హాట్‌కేకుల్లా..

గజం భూమి ధర రూ.2.98 లక్షలు
- కేపీహెచ్‌బీ కాలనీ స్థలాలకు భారీ స్పందన
- రూ.141.36 కోట్లు పలికిన 18 ప్లాట్‌లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలాలకు బుధవారం ఏర్పాటు చేసిన వేలం పాటలో భారీ స్పందన లభించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని 7వ ఫేజ్‌లోని 18 ప్లాట్లను వేలం వేయగా అన్ని ప్లాట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోయాయి. 7వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 22ను అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షల చొప్పున దక్కించుకున్నారు. 151 గజాలున్న ఈ ప్లాట్ 4 కోట్ల 52 లక్షల 72 వేల 160 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అదే విధంగా 292 గజాలు ఉన్న 19వ నంబర్ ప్లాట్ గజానికి రూ.2.88 లక్షల చొప్పున వేలకు వేలం పాడారు. ఈ ప్లాట్ నుంచి 8 కోట్ల 40 లక్షల 96 వేల రూపాయలు వచ్చాయి. ఇక్కడ ఉన్న మొత్తం 18 ప్లాట్‌లలోని 6,236.33 గజాలకు కలిపి 141 కోట్ల 36 లక్షల 89 వేల 100 రూపాయల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

వానలకు అనుకూలంగా వాతావరణం

▶ మొదటి పేజీ తరువాయి

మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మాటూర్‌లో 4.93 సెం.మీ. వర్షం

బుధవారం రాష్ట్రంలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 11 రోజుల్లో 3.37 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. బుధవారం సాయంత్రానికి 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాటూర్‌లో 4.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లిలో 4.35, నల్లగొండ జిల్లా ముదిగొండలో 3.38, పడమటిపల్లిలో 3.10, తిమ్మాపూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి
- కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్‌కౌశిక్, వేణుయాదవ్, వరలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ బీసీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలని ఆర్.కృష్ణయ్యకు హితవు చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో విడుదల చేయకపోతే గాంధీభవన్‌ను ముట్టడిస్తామని బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్ కౌశిక్, వేణుయాదవ్, మచ్చ వరలక్ష్మిలు మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ఈ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కానీ ఈ విషయంలో ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి అని, బీజేపీలో ఉండి ఆయన బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక జీవో విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య మాట్లాడుతున్నారని, ఆ జీవోను కోర్టు కొట్టి వేస్తే, బీజేపీ ఎంపీగా ఉన్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్ల గురించి కేంద్రంతో మాట్లాడి 9వ షెడ్యూల్‌లో పెట్టిస్తారా? అని సవాల్ చేశారు. 40 ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్లను ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని, ఈ విషయాన్ని కృష్ణయ్య ఒప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్‌ఎల్‌బీసీ పనులపై ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే

- టన్నెల్ ప్రాంతంలో నేల స్వభావాన్ని కచ్చితంగా గుర్తించే ప్రయత్నం
- రక్షణ శాఖ హెలికాప్టర్లతో సర్వే నిర్వహిస్తాం: మంత్రి ఉత్తమ్


వీరేంద్ర తివారీతో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టన్నెల్ ప్రాంతంలోని నేల స్వభావాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ప్రత్యేక హెలికాప్టర్లతో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే చేయించాలని నిర్ణయించింది. అందుకోసం తక్కువ ఎత్తులో ఎగిరే సామర్థ్యం గల రక్షణ శాఖకు చెందిన రెండు హెలికాప్టర్లు వినియోగించనున్నారు. సర్వే పరికరాలను డెన్మార్క్ నుంచి ప్రత్యేకంగా తెప్పించనున్నారు. ఈ సర్వేపై బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సీఈ అజయ్‌కుమార్‌లు నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ వీరేంద్ర తివారీ, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ డీజీగా పనిచేసిన హర్‌పాల్‌సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాలతో విడివిడిగా భేటీ అయ్యారు. టన్నెల్ పునరుద్ధరణ, సర్వే, నిర్మాణ పనులపై వారితో చర్చించారు. సర్వే కోసం రెండు ప్రత్యేక హెలికాప్టర్లను ఇవ్వాలని కోరగా, రక్షణ శాఖ అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రో మ్యాగ్నటిక్ పరికరాలతో జరిపే సర్వే భూ ఉపరితలం నుంచి ఒక కిలోమీటర్ లోతు వరకు నేల స్వభావంతో పాటు ఇతర సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా నిర్మాణ పనులు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. జూలై 12న సర్వే మొదలై వారం రోజుల్లో పూర్తవుతుందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో టన్నెల్ పనులను పూర్తిచేసి కృష్ణా జలాలను గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. టన్నెల్ పనుల పూర్తికోసం కల్నల్ పరీక్షిత్ మెహ్రా డిప్యుటేషన్‌పై రెండేళ్లపాటు సాగునీటి శాఖలో స్పెషల్ సెక్రటరీ హోదాలో పనిచేస్తారని చెప్పారు. టన్నెల్ తవ్వకాల్లో అపార అనుభవం ఉన్న జనరల్ హర్పాల్ సింగ్ తెలంగాణ ప్రభుత్వానికి జీతం తీసుకోకుండా గౌరవ సలహాదారుగా సేవలు అందిస్తారని వివరించారు.

ఎరువులు, విత్తనాల విషయంలో అప్రమత్తత అవసరం: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: కేటాయించిన లక్ష్యానికన్నా తక్కువ మొత్తంలో సరఫరా చేసిన యూరియా, ఇతర ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలని ఎరువుల కంపెనీల ప్రతినిధులను వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సచివాలయంలో అధికారులు, ఎరువుల కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జూన్‌కు కేటాయించిన 1.70 లక్షల మెట్రిక్ టన్నులతో పాటు ఇప్పటివరకు తక్కువగా సరఫరా చేసిన 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను జూలైలోగా సరఫరా చేయాలన్నారు. కేటాయించిన ఎరువులను సరఫరా చేయకపోతే ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరి సాగుకు ఈసారి సన్న రకాల విత్తనాలు, పౌరసరఫరాల శాఖ కొనుగోలుకు అనువుగా ఉండే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి తుమ్మల.. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి సూచించారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

పాలమూరు: పెద్ద ధన్వాడ వద్ద చేపడుతున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని, ఇకపై తెలంగాణలో ఇథనాల్ కంపెనీల ఏర్పాటు మానుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడేవిధంగా ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు చేస్తామని, ఆందోళనకారులపై చర్యలు తీసుకుంటామని బెదిరింపు గొంతుతో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడటం సరికాదని.. ఆయన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇథనాల్ కంపెనీల పాలసీపై కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమీక్ష చేస్తామని చెప్పి ఇప్పుడు ప్రజలు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. నిర్మల్ జిల్లాలో రద్దు చేసినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎందుకు రద్దు చేయడంలేదనే విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. 12మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా జిల్లాను కాలుష్యం నుంచి రక్షించడం లేదన్నారు.

సెట్విన్ ఆధ్వర్యంలో ఫైనల్ పరీక్షలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని ‘నవరత్నాలు’ శిక్షణ కేంద్రంలో బుధవారం సెట్విన్ ఆధ్వర్యంలో ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ మూడు నెలల పాటు కంప్యూటర్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్ కోర్సులలో శిక్షణ పొందిన రెండో బ్యాచ్‌కు చెందిన 247 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను సెట్విన్ హైదరాబాద్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, మహబూబ్‌నగర్ డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆయా కోర్సులలో ఉదయం థియరీ, మధ్యాహ్నం ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరిగాయి. ఇక డీవైఎస్‌ఓ సూపరింటెండెంట్ రవీందర్‌రెడ్డి, సెట్విన్ నిర్వాహకులు విజయకుమార్, ఎగ్జామినర్లు పి.వనజ, అజ్మత్ ఉన్నీస, తన్వీర్‌సుల్తాన్ పర్యవేక్షించారు. కాగా, కొత్తగా మూడో బ్యాచ్ ఈనెల 18 నుంచి ప్రారంభమవుతుందని ‘మహబూబ్‌నగర్ ఫస్ట్ – నవరత్నాలు’ పర్యవేక్షకులు గుండా మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 550 మంది అభ్యర్థులు శిక్షణ పొందారని వివరించారు.

ఎట్టకేలకు..!

- వాలీబాల్ అకాడమీకి కదలికలు
- నేడు, రేపు రాష్ట్రస్థాయి సెలక్షన్స్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఔత్సాహిక వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ నడిచిన నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచేవారు. నిధుల నిర్వహణ భారంతో 2008లో వాలీబాల్ అకాడమీని మూసివేశారు.అప్పట్లో ఈ వాలీబాల్ అకాడమీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందిన జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగారు.

మెయిన్ స్టేడియంలో ఏర్పాటు

మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని తిరిగి ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉండగా.. మూడేళ్ల కిందట పునఃప్రారంభ మైంది. రూ.19లక్షల70వేలతో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేశారు. స్టేడియం ఆవరణలోని స్విమ్మింగ్ పూల్‌లోని పైఅంతస్తుల గదులను అకాడమీ క్రీడాకారుల వసతికి కేటాయించారు. గదుల ఆధునీకరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను ఆధునీకరించి వాటి స్థానంలో నూతన కోర్టులు ఏర్పాటు చేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలు పొందే క్రీడాకారులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు సంబంధించి కొంతమేర వసతి సౌకర్యాలు ఇప్పటికే అకాడమీకి చేరాయి. మంచాలు, టేబుల్స్, బీరువాలతోపాటు ఇతర వస్తువులు వచ్చాయి. అకాడమీలో ప్రవేశాలు పొందే బాల, బాలికలకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో వాలీబాల్‌లో మెరుగైన శిక్షణ అందజేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతారు.

> **సెలక్షన్స్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం**
>
> జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నేడు, రేపు జరిగే వాలీబాల్ అకాడమీ సెలక్షన్స్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే బాల, బాలికలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా సంబంధిత ధృవ పత్రాలతో ఉదయం 8 గంటలకు మెయిన్ స్టేడియంలో రిపోర్టు చేయాలి.
>
> – శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్


కోర్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్, కోచ్ పర్వేజ్‌పాషా

నేడు, రేపు అకాడమీ ప్రవేశాల సెలక్షన్స్

మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నూతన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం 2022 డిసెంబర్ 1వ తేదీన రాష్ట్రంలోని బాల, బాలికలకు సెలక్షన్స్ నిర్వహించారు. అయితే సెలక్షన్స్ జరిగినప్పటికీ క్రీడాకారుల ప్రవేశాలు మాత్రం కల్పించలేదు. ఎట్టకేలకు వాలీబాల్ అకాడమీకి ముందడుగు పడింది. నేడు, రేపు రాష్ట్రస్థాయి వాలీబాల్ సెలక్షన్స్ చేపట్టనున్నారు. 14–16ఏళ్ల బాల, బాలికలు ఎంపికలకు అర్హులు.

సినీఫక్కీలో పోలీసులపై దాడి

- మద్యం మత్తులో ఓ కుటుంబం వీరంగం
- యువకుడిపై దాడి..విచారణ కెళ్లిన పోలీసులపై దురుసు ప్రవర్తన
- రణరంగమైన మార్కెట్‌యార్డు ఘటన.. రంగంలోకి సీఐ, ఎస్సైలు
- నిందితులను ఠాణాకు తరలిస్తుండగా కర్రలతో స్థానికుల దాడికి యత్నం
- విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిపై కేసు నమోదు

గద్వాల క్రైం: రోడ్డుపై బైక్ సాంకేతిక సమస్య కారణంగా నిలిచిన యువకుడిపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేయగా.. విచారణకు వెళ్లిన పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడి దురుసుగా ప్రవర్తించిన ఘటన బుధవారం తెల్లవారుజామున గద్వాల జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితుడు, పోలీసుల కథనం మేరకు..

మల్దకల్ మండలం పాల్వాయికి చెందిన భరత్‌కుమార్ ఏరువాక పౌర్ణమి సందర్భంగా సరుకుల కొనుగోలుకు బైక్‌పై జిల్లాకేంద్రానికి వచ్చి రాత్రి 10.30గంటలకు స్వగ్రామానికి వెళ్తున్నాడు. బైక్ మార్కెట్ యార్డు (శ్రీనివాసకాలనీ) సమీపంలో నిలిచిపోయింది. బైక్‌ను స్టార్ట్ చేసేందుకు యత్నిస్తుండగా.. అదేకాలనీకి చెందిన రామాచారితో పాటు మద్యం మత్తులో యువకుడితో వాగ్వాదానికి దిగి భరత్‌కుమార్‌పై దాడిచేశారు. దెబ్బలకు తాళలేక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తుండగా.. మద్యం మత్తులో ఉన్న రామాచారితోపాటు కుటుంబ సభ్యులు దురుసుగా ప్రవర్తించి పోలీసులపై దాడి చేశారు. ఈ విషయమై పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

రంగంలోకి దిగిన పోలీసులు

శ్రీనివాసకాలనీ సమీపంలో విచారణకు వెళ్లిన సిబ్బందిపై దాడి చేసినట్లు 11:30 గంటలకు సీఐ శ్రీను, ఎస్‌ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్, మల్లేశ్‌కి సమాచారం అందింది. అక్కడికి చేరుకుని అల్లరి మూకలను చెదరగొట్టారు. విచారణ సమయంలో కానిస్టేబుల్ పాలక్షిరెడ్డి, కిరణ్‌కుమార్‌పై దాడి చేయడంపై కుటుంబసభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుంటుండగా.. అధికారులను సైతం లెక్క చేయకుండా మద్యం మత్తులో ప్రతిఘటించారు. కొందరు మహిళలు రాళ్లు, కర్రలతో దాడిచేసే ప్రయత్నం చేయగా.. రణరంగంగా మారిపోయింది. గంటన్నర తర్వాత అల్లర్లకు పాల్పడిన వారిని అతికష్టం మీదుగా పోలీసు వాహనాల్లో ఎక్కించుకొని ఠాణాకు తరలించారు. మరికొందరు వాహనంలో తప్పించుకునే ప్రయత్నం చేశారు. వెంబడించి పట్టణ శివారులో అదుపులోకి తీసుకున్నారు. సినిమా తరహాలో ఘటన చోటు చేసుకోవడం కాలనీవాసులు సైతం భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో పోలీసు వాహనాల వెంట పరుగులు తీశారు.

8 మందిపై కేసులు నమోదు

మంగళవారం రాత్రి పాల్వాయికి చెందిన యువకుడు భరత్‌కుమార్‌పై దాడి, విచారణకు వెళ్లిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన రామాచారి, మహేశ్‌చారి, మనీశ్ కుమార్ చారి, శ్రీకాంత్ చారి, శశికళ, అలివేలు, సుజాత మరికొంతమంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు, పోలీసు విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నడిగడ్డలో సెంట్రల్ ఐబీ బృందం ఆరా

- మావోయిస్టుల జాబితా సేకరణ
- ఆపరేషన్ కగార్ నేపథ్యంలో రహస్య పర్యటన
- అజ్ఞాతంలో పలువురు జిల్లా వాసులు
- వివరాలు వెల్లడించలేం: సీఐబీ అధికారి

గద్వాల క్రైం: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో నక్సల్ ఏరివేత తెలంగాణలో కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లాలో నక్సల్ ప్రభావం నడిగడ్డలోని యువత, ప్రజావ్యతిరేఖత ఉన్న ప్రభుత్వాలపై ఇక్కడి వ్యక్తులు దండకారణ్యంలోకి వెళ్లి ప్రజాసమస్యలపై రహస్య పోరాటం చేసిన ఘనత ఇక్కడి నేతలకు పేరుంది. బుధవారం ఉదయం నుంచి సెంట్రల్ ఇంటలిజెన్స్ బ్యూరో అధికారులు జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు గ్రామాల్లో రహస్యంగా పర్యటించి అజ్ఞాతంలో ఉన్నవారి వివరాలను సేకరించారని తెలిసింది. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు అగ్రనేతలు ఇటీవల ఎదురుకాల్పుల్లో మృతిచెందగా.. ఇంకా కొందరు సిద్ధాంత పోరుబాటలోనే నడుస్తున్నారు. ఈ ప్రాంతాల్లో కూడా పలు పార్టీలకు చెందిన ముఖ్యనేతలు నక్సల్ చేతిలో మృతిచెందారు. అయితే తాజాగా సెంట్రల్ ఐబీ బృందం అధికారులు జిల్లాలో పర్యటించడం ఆసక్తికరంగా మారింది.

సానుభూతిపరుల వివరాలు సేకరణ

కొంతకాలంగా జిల్లాలో మావోయిస్టుల కదలికలు పూర్తిగా లేకపోయాయి. అయితే 05.10.2019లో ఓ విద్యార్థి సంఘం ముసుగులో యువత మావోయిస్టుల సిద్ధాంతాలకు ఆకర్షితులై సానుభూతి పరులుగా ఉంటున్నారనే సమాచారం మేరకు గద్వాల, వనపర్తి, హైదరాబాద్, నారాయణపేట్, మహబూబాద్, జనగాం, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాకు చెందిన వారిని గుర్తించి అరెస్టు చేశారు. అప్పట్లో ఈ కేసు జిల్లాలో కలకలంగా మారింది. ఈ కేసులో 37మంది సానుభూతిపరులు ఉన్నట్లు పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. పలువురిని రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉంది. ప్రభుత్వ కార్యక్రమాలపై వ్యతిరేఖతతో ఉన్న యువత, మేధావి వర్గం, నక్సల్‌గా జీవనం సాగించి లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి ఉంటున్నవారి వివరాలను సీఐబీ అధికారులు సేకరించారు. అయితే గద్వాల, మల్దకల్, గట్టు, ధరూర్, కేటీదొడ్డి, అయిజ, శాంతినగర్, రాజోళి, అలంపూర్ తదితర పోలీసు స్టేషన్‌లలో నమోదైన మావోయిస్టుల కేసులు, అదృశ్యమై అజ్ఞాతంలో ఉన్న వారి వివరాలను పోలీసు నిఘావర్గాల నుంచి నివేదికలు సేకరించినట్లు సమాచారం. రెండు రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో పోలీసుశాఖ అనుమానిత వ్యక్తులపై నిఘా ముమ్మరం చేసింది.

పదకొండేళ్లలో దేశం పురోగతి

పాలమూరు: కేంద్ర ప్రభుత్వం విధానాలతోపాటు ప్రధానీ మోదీ అభివృద్ధి వల్ల ప్రపంచ దేశాల్లో భారతదేశం 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గొప్ప విషయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌పీఎస్ ప్రభాకర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం 11ఏళ్ల పాలనపై విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి కాంగ్రెస్ పాలనతో బేరీజు వేసుకుంటే ఈ 11ఏళ్ల బీజేపీ పాలనలో దేశం ఎంతో ముందుడుగు వేసిందన్నారు. బీజేపీ పాలనలో దేశం ఆర్థిక, భద్రత, రక్షణ, వాణిజ్యం ఇలా అన్నిరంగాల్లో ఎంతో పురోగతి సాధించిందన్నారు. ప్రధానంగా దేశ రక్షణ విషయంలో మోడీ తీసుకున్న నిర్ణయాలు దేశ ఖ్యాతిని పెంచాయన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్‌రద్దు, కరోనా సమయంలో టీకాల పంపిణీ, 80కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలు పేదలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు పద్మజారెడ్డి, పాండురంగారెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘విభజన’ ప్రక్రియపై వెల్లువెత్తిన అభ్యంతరాలు

- చివరిరోజు 44తో కలుపుకొని మొత్తం 73 వచ్చిన వైనం
- డివిజన్ల ముసాయిదా సరిగా లేదన్న ప్రతిపక్షాలు
- ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు అధికారుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల ముసాయిదాపై అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఈ ప్రక్రియ పారదర్శకంగా లేదని, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి ఇష్టానుసారంగా విభజన ప్రక్రియ చేపట్టారని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కొన్ని వీధులను గంపగుత్తగా ఒకే డివిజన్‌కు మార్చి కొత్తగా ఏర్పాటు చేయడం తగదని విమర్శిస్తున్నారు. ఇక ఈనెల 5న ఆరంభమైన ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణకు గడువు బుధవారంతో ముగిసింది. ఈ వారం రోజులలో మొత్తం 73 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో చివరిరోజే ఏకంగా 44 అందాయి. వీటిని ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి అవసరమైతే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది.

అధికార పార్టీకి అనుకూలంగా: బీఆర్ఎస్

డివిజన్ల విభజన అధికార పార్టీకి అనుకూలంగా చేశారంటూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. రోడ్ మ్యాప్ లేకుండా ఇంటి నంబరలతో చేయడం సరికాదని అందులో పేర్కొన్నారు. కొత్త డివిజన్ ఎక్కడి నుంచి మొదలై ఎక్కడ పూర్తవుతుందో ఒక స్పష్టత లేదన్నారు. కొన్ని వార్డులలో నాలుగు వేలకు పైగా ఓటర్లు ఉన్నారని, ఈ విభజన శాస్త్రీయంగా లేదన్నారు. వీటిని అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తాటి గణేష్‌కుమార్, అనంతరెడ్డి, రాము, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాల సతీష్, శరత్‌రెడ్డి, సాయిలు, నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.